క్లుప్తంగా

ప్రారంభమైన శ్రీప్రసన్న విఘ్నేశ్వర స్వామి ఉత్సవాలు

కడప కల్చరల్ : కడప నగరం బెల్లంమండిలోని శ్రీప్రసన్న విఘ్నేశ్వర స్వామి త్రిపుష్కరసహిత అష్టబంధన మహాకుంభాభిషేకం ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి.ఈ నెల 12వరకు జరగనున్న ఈ ఉత్సవాలలో భాగంగా తొలుత ఫైర్ ఆఫీసు వద్ద నుంచి పుట్టమన్ను సేకరించి ఊరేగింపుగా ఆలయానికి చేర్చారు.ప్రధాన కలశ స్థాపన నిర్వహించి గణపతి, దీక్షా హోమం నిర్వహించారు. 9న సహస్ర లింగార్చన. 10న దీక్షా హోమం, 11న పూర్ణాహుతి, మహాకుంభాభిషేకం నిర్వహిస్తారు. ఉదయం 10 గంటలకు శ్రీసిద్ధి, బుద్ధిలతో విఘ్నేశ్వర స్వామికి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం 5కు నగరోత్సవం, 12న సాయంత్రం 5గంటలకు పుష్పయాగం నిర్వహిస్తారు.

గంగమ్మ ఆలయం ప్రారంభం


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి ప్రధాన రహదారిలోని మద్దిమడుగు బిడికిలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయాన్ని బుధవారం కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలను అందుకున్నారు. కార్యక్రమంలో మండల కో కన్వీనర్ కళాయాదవ్, సర్పంచ్ మల్లి ఖార్జునయాదవ్, అమానుల్లా తదితరులు పాల్గొన్నారు.

17న చలో విజయవాడ

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఆశా, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 17న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ వెల్లడించారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న వీరికి ఉద్యోగ భద్రత లేదని విచారం వ్యక్తం చేశారు. వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలన్నారు. ఆయా సమస్యలపై నిర్వహించనున్న చలో విజయవాడను ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కేసీ బాదుల్లా, సుభాషిణి, కల్పన, అయ్యావారమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శివార్జున కోరారు. బుధవారం కడపలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు పీఆర్‌సీపై అసంతృప్తిగా ఉన్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌బాబు మాట్లాడుతూ పని సర్దుబాటు కింద ప్రమోషన్లను ఇచ్చి ఉపాధ్యాయులకు జీతంతోపాటు వారికి ఇవ్వాల్సిన అలవెన్స్ రూ. 2500 ఇవ్వాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు , రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శేషగిరిరావు, జిల్లా కార్యదర్శులు కట్టా గంగాధర్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కీళ్లవైద్యంపై అవగాహన

కడప కల్చరల్ : మహిళలు కీళ్లనొప్పులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి నగరానికి చెందిన ప్రముఖ ఎముకలు, కీళ్లవైద్య నిపుణులు విద్యాసాగర్‌రెడ్డి అవగాహన కల్పించారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలోని ఆయన నర్సింగ్‌హోంలో విద్యాసాగర్ ఆర్థరైటిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. డయాబెటాలజిస్ట్ డాక్టర్ శ్రీలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

చెన్నూరు : స్థానిక మండల పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను బుధవారం తహసీల్దార్ పఠాన్ ఆలీఖాన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో తూర్పు వైపున ఉన్న పట్టభద్రులకు సంబంధించిన 19వ పోలింగ్ కేంద్రాన్ని, అలాగే పడమర వైపు ఉన్న ఉపాధ్యాయులకు సంబంధించిన 15వ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. 1100 మంది పట్టభద్రులు, 67 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

అవనిలో ఆమె సగం


ఆర్టీసీ ఆర్ఎం కాన్ఫరెన్స్ హాల్లో మహిళా ఉద్యోగులను సత్కరిస్తున్న ఈడీ


కొవ్వొత్తుల ర్యాలీని ప్రారంభిస్తున్న ఏఆర్ అదనపు ఎస్పీ కృష్ణారావు


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు, ఎన్‌సీసీ క్యాడెట్లు

కడప స్పోర్ట్స్/వైవీయూ : కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని స్టెప్ మేనేజర్ వి.వి.సుబ్బారాయుడు, వైఎస్ఆర్ క్రీడా పాఠశాల ప్రత్యేకాధికారి ఎస్.బాషామోహిద్దీన్, డీఎస్ఏ చీఫ్ కోచ్ అమృత్‌రాజ్ ప్రారంభించారు. స్టెప్ సిబ్బంది, డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

రెజ్లింగ్ క్రీడాకారిణులకు మెడల్స్ పంపిణీ..
వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రెజ్లింగ్ పోటీల్లో విజేతలకు స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ మెడల్స్ అందజేశారు. కోచ్‌లు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో మహిళ కీలకం: జడ్జి కవిత
సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత పేర్కొన్నారు. బుధవారం శ్రీవివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో మహిళలకు ఉన్న హక్కులను, చట్టాలను గురించి అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీహరి డిగ్రీ కళాశాలలో.. శ్రీహరి డిగ్రీ, పీజీ కళాశాలలో వైవీయూ పాలకమండలి సభ్యుడు, కళాశాల కరస్పాండెంట్ జి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహిళలు లేనిదే మనుగడ లేదన్నారు. ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, అధ్యాపకులు కేశవరెడ్డి, కరీముల్లా, జ్యోతి, అనంత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో..
నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకలకు వైవీయూ ఎంబీఏ అసోసియేట్ ప్రొఫెసర్ డా. పి. సరిత విచ్చేసి మహిళల ప్రాధాన్యతను వివరించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

స్కిల్‌సెంటర్‌లో.. నగరంలోని నిహార్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో విద్యుత్‌శాఖ ఏఈఈ మహమ్మద్ ఆసిఫ్ పాల్గొని పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో మమత, షబరిన్, అనురాధ, మజీబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం పోరాటాలు చేయాలి
కడప వైఎస్ఆర్ సర్కిల్: మహిళల హక్కుల కోసం పోరాటాలు చేయాలని రాయలసీమ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు తస్లీమ్ పేర్కొన్నారు. బుధవారం రామకృష్ణ నగర్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పర్వీన్, నాగమ్మపాల్గొన్నారు.

■ ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సీపీఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.

కడప కార్పొరేషన్ : మహిళలు రాణించని రంగం అంటూ ఏదీ లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ప్రేమాలయం నిరాశ్రయుల వసతి గృహంలో రక్షణ సంస్థ అధ్యక్షుడు పి. సంపత్ కుమార్, సీజేపీ ఫౌండేషన్ అధ్యక్షురాలు చైతల్య ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల ఇన్‌చార్జి సీహెచ్ జ్యోతిర్మయి, డా.అవ్వారు శిరీష, తాలూకా స్టేషన్ కానిస్టేబుల్ శిరీష, కొమ్మలపాటి లావణ్య, సారెడ్డి చైతల్య, రామలక్ష్మిలను సన్మానించారు.

■ సమాజంలో మహిళలు అందిస్తున్న సేవలు మరువలేమని సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం మౌలానా ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో మిత్ర ఫౌండేషన్ చైర్మన్ నీరజ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ వాణిని సత్కరించారు.

కడప ఎడ్యుకేషన్ : దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం విద్యామందిర్ హైస్కూల్లో ఎస్టీయూ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లింగ వివక్షతకు స్వస్తి పలికినప్పుడే సమసమాజం సాధ్యపడుతుందన్నారు. అనంతరం సీనియర్ ఉపాధ్యాయులకు, మహిళామణులను సత్కరించారు.

మహిళలను గౌరవించడం సాంప్రదాయం
కడప కోటిరెడ్డిసర్కిల్ : భారతీయ సంస్కృతిలో మహిళలకు గౌరవ ప్రదమైన స్థానముందని, ఆడవారిని గౌరవించడం ఇంటినుంచే మొదలైనపుడే సమాజం గౌరవిస్తుందని ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపినాథ్ రెడ్డి, ఎస్‌కెఆర్ ఎస్‌కెఆర్ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుబ్బలక్షుమ్మలు తెలిపారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని డిప్యూటీ పర్సనల్ మేనేజర్ రాజా గజలక్ష్మి అధ్యక్షతన ఆర్టీసీ ఆర్ఎం కాన్ఫరెన్స్ హాలులో మహిళా ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించారు. పలువురు మహిళా ఉద్యోగులను ఈడీ ఘనంగా సత్కరించారు.

■ దేశాభివృద్ధిలో మహిళలే కీలకమని ఎస్‌బిసీసీ జిల్లా కోఆర్డినేటర్ కెతుర, డిప్యూటి మేయర్ ముంతాజ్ బేగంలు తెలిపారు.బుధవారం నగరంలోని రహమతీయ కన్వెన్షన్ హాలులో జనవికాస్ సేవా సమితి ఆధ్వర్యంలో 25 మంది మహిళలను సత్కరించారు. తాహీర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

కడప సిటీ : సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమని సమాచార శాఖ ఏడి వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడప కలెక్టరేట్‌లోని జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో ఏడి వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కడప ఎడ్యుకేషన్ : మహిళలు అన్ని రంగాల్లో నిష్ణాతులుగా ఎదిగి దేశ పురోభివృద్ధికి పాటుపడాలని స్టెప్ సీఈఓ గ్రేస్ నిర్మల, ఇంటర్ ఆర్ఐవో రమణరాజులు పేర్కొన్నారు. కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ నీలవేణి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు.

■ కడప డీసీసీ బ్యాంకులో మేనేజర్ షకీలా అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రిమ్స్ వైద్యులు డాక్టర్ భారతి, కేఎస్ఎం ప్రిన్సిపాల్ రత్నమ్మ, అడ్వకేట్ లీజ హాజరయ్యారు. బ్యాంకు మేనేజర్స్ శైలజ, సుకన్య,కుమారి శర్వాని పాల్గొన్నారు.

ప్రధాన తపాలా కార్యాలయంలో..
నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విధుల్లో ప్రతిభ కనబరచిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ గౌస్ ఆజం, ఏఎస్పీ విజయ భాస్కర్, అసిస్టెంట్ పోస్టు మాస్టర్ సునీత దేవి పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఆధ్వర్యంలో..
కడప కల్చరల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం, పీఅండ్‌జీఎస్ సిబ్బంది నగరంలోని చౌడేశ్వరి వృద్ధాశ్రమానికి 10 కుర్చీలు, వివేకానంద వానప్రస్థ ఆశ్రమానికి ఒక మిక్సీ, మాధవరంలోని కాశినాయన వృద్ధాశ్రమానికి 6 ఫ్యాన్లు అందజేశారు. స్థానిక ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయ ఆవరణలో ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రభుత్వ పురుషుల కళాశాల వృక్షశాస్త్రశాఖ అధ్యాపకుడు డా.కృష్ణారెడ్డి, ఎల్ఐసీ ఈడీఎంఎస్ విభాగం మేనేజర్ శ్రీదేవి, శ్రామిక మహిళా నేతలు అమీనాపర్వీన్, శ్రీవాణి, వసుప్రద, వారిజాతమ్మ, శ్రీకృష్ణ పాల్గొన్నారు.

మొల్లమాంబకు నివాళి..
మొల్లప్రభ సేవాసమితి అధ్యక్షులు మల్లెల రామాంజనేయులు బృందం మొల్ల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను సత్కరించారు.

బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో..
కడప నగరంలోని బ్రహ్మకుమారీ సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ దేవరాజు, ఆర్‌జేడీ రవి, రిమ్స్ మెడికల్ ఆఫీసర్ డా. సాయిప్రీతి, స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్, డా. తేజశ్వినిలు అతిథులుగా హాజరయ్యారు. సంస్థ జిల్లా కోఆర్డినేటర్ గీతా బెహన్ మాట్లాడుతూ మహిళల ప్రాధాన్యతను వివరించారు.

వికలాంగుల సంస్థ ఆధ్వర్యంలో..
స్థానిక అంగడివీధిలోని అనాథ, వికలాంగుల సేవా సంస్థలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్ఐసీ నాగరాజుపేటశాఖ మహిళా ఉద్యోగిణులు వితరణ కార్యక్రమం చేపట్టారు. సంస్థ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ తదితరులు సంస్థకు మైక్‌సెట్‌ను, క్యాంటీన్ క్యారియర్‌ను అందజేశారు. వికలాంగుల సేవాసంస్థ అధ్యక్షుడు కమాల్‌బాషా పాల్గొన్నారు.

రైల్వేల ఆధ్వర్యంలో..
అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కడప రైల్వే స్టేషన్‌లో తిరుపతి రైల్వే డీఎస్పీ షేక్ షాను సబ్ డివిజన్‌లోని మహిళా పోలీసులందరు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, అధికారులు పాల్గొన్నారు.


తిరుపతి రైల్వే డీఎస్పీ షేక్ షాను సత్కరిస్తున్న మహిళా పోలీసులు


మహిళలను సన్మానిస్తున్న రాయలసీమ మహిళా సంఘం నాయకురాళ్లు


వికలాంగులసేవాసంస్థకు మైక్‌సెట్ అందజేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు


మహిళలను సత్కరిస్తున్న అఫ్జల్‌ఖాన్ తదితరులు


పోస్టల్ ప్రధాన కార్యాలయంలో మహిళలకు బహుమతులు అందజేస్తున్న సూపరింటెండెంట్


సన్మాన గ్రహీలతో ఎస్టీయూ నాయకులు


జనవికాస్ సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలను సత్కరిస్తున్న అతిథులు

జగనన్న నాయకత్వాన్ని బలపరచండి

ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి మాసీమ బాబు

కడప కార్పొరేషన్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేయడం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని కడప నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి మాసీమ బాబు కోరారు. బుధవారం స్థానిక 23వ డివిజన్‌లో ఆ వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయుల నియోజకవర్గానికి పోటీ చేస్తున్న ఎంవీ రామచంద్రారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.కార్పొరేటర్ రామలక్ష్మణ్‌రెడ్డి, మహిళా నేతలు టీపీ వెంకట సుబ్బమ్మ, శ్రీలక్ష్మి, సునీత, జ్యోతి, తులశమ్మ, పద్మ, సాబీరా, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.


ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

20వ డివిజన్‌లో..
పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ 20వ డివిజన్ కార్పొరేటర్ వై. మాధవి, డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్ రెడ్డిల ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డు కాలనీ, మారుతీ నగర్‌లలో ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వైవీయూలో ఉత్సాహంగా అంతర్ కళాశాలల పోటీలు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన అంతర్ కళాశాలల క్రీడాపోటీలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. రైఫిల్ షూటింగ్, పిస్టల్ విభాగం, వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ క్రీడాంశాల్లో నిర్వహించిన ఎంపికలను వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి ప్రారంభించారు. వైవీయూ క్రీడా ఎంపికల్లో ప్రతిభ కనబరిచే క్రీడాకారులను అంతర్ విశ్వవిద్యాలయ క్రీడాపోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించారు.



పవర్ లిఫ్టింగ్ ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వైభవంగా హుస్సేన్ వల్లి ఉరుసు

పెండ్లిమర్రి : మండలంలోని మొయిళ్లకాల్వ గ్రామంలో వెలసిన శ్రీ హజరత్ హుస్సేన్ వల్లి ఉరుసు, శ్రీనారాయణస్వామి ఆరాధన ఉత్సవాలు రెండవ రోజు బుధవారం దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారికి పూజలు, దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ అవరణలో ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. ముందుగా నారాణయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఉస్సెన్, కృష్ణారెడ్డి, బ్రహ్మంరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

డ్వాక్రా మహిళలకు రూ.3కోట్ల రుణాలు

చాపాడు: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రమైన చాపాడులో బుధవారం 20 స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.3 కోట్ల రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. మండల సమాఖ్య అధ్యక్షురాళ్లుగా పని చేసిన శ్యామల, సుమలతను ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో యూనియన్ బ్యాంకు మేనేజరు రాజశేఖర్‌రెడ్డి 20 స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డ్వాక్రా ఏపీఎం వెంకట రమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

కడప అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం సాయంత్రం కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ నుంచి కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు జెండా ఊపి ప్రారంభించారు. కోటిరెడ్డి సర్కిల్ నుంచి నాగరాజుపేట, పాత బస్టాండ్, ఏడు రోడ్ల కూడలి మీదుగా పోలీస్‌పరేడ్ గ్రౌండ్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో భారీ సంఖ్యలో మహిళా అధికారులు, పోలీసు అధికారులు, విద్యార్థినులు, స్వచ్ఛంద సంస్థలు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ రమణయ్య, కడప డీఎస్పీ బి. వెంకట శివారెడ్డి, 'దిశ' డీఎస్పీ ఆర్. వాసుదేవన్, ఆర్ఐలు వీరేష్, సోమశేఖర్ నాయక్, దిశ ఇన్స్‌పెక్టర్ వినయ్‌కుమార్ రెడ్డి, కడప ఒన్‌టౌన్ సీఐ ఎన్.వి.నాగరాజు, రిమ్స్ పీఎస్ సీఐ కె. రామచంద్ర, టూటౌన్ సీఐ సయ్యద్ హసం, తాలూకా సీఐ ఉలసయ్య, చిన్నచౌక్ సీఐ శ్రీరామ్ శ్రీనివాస్, కమాండ్ కంట్రోల్ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్ఎస్ఐలు పోతురాజు, వెంకటేశ్వర్లు, పైడినాయుడు, ఎస్ఐలు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, ఎన్‌సీసీ క్యాడెట్లు, వివిధ కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.

జీఐఎస్ విజయవంతంపై సంబరాలు

కడప కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ విజయవంతంపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్. సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బాణ సంచా కాల్చి, మిఠాయిలు తినిపించుకొని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు పాల్గొని మాట్లాడుతూ దేశంలో ఎక్కడా నిర్వహించని విధంగా విశాఖలో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ దేశాల్లో పేరెన్నికగన్న దిగ్గజ కంపెనీలన్నీ పాల్గొని రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిని చూపడం శుభపరిణామమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అఫ్జల్‌ఖాన్, డిప్యూటీ మేయర్లు ముంతాజ్ బేగం, బి. నిత్యానందరెడ్డి, సీహెచ్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం

వీరపునాయునిపల్లె : మండలంలోని గోనుమాకులపల్లెలో బుధవారం సాయిబాబా ఉత్సవ విగ్రహమూర్తి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఎస్.పాలగిరి క్రాస్ వద్ద కాశిరెడ్డి నాయన ఆలయ ప్రాంగణంలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాల్లో భాగంగా రెండవ రోజు కార్యక్రమాలు నిర్వహించారు. బాబా ఉత్సవ మూర్తిని గోనుమాకులపల్లె గ్రామానికి తీసుకెళ్లి గ్రామోత్సవం నిర్వహించారు. మునెయ్య బృందం చెక్కభజనలో అలరించింది. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 7గంటల నుంచి 8గంటల లోపు సాయిబాబా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఉంటుందని ఆలయ ధర్మకర్త నర్రావుల పుల్లారెడ్డి తెలిపారు.

బంజారాలు సంఘటితంగా సమస్యలు పరిష్కరించుకోవాలి

ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : బంజారాలు సంఘటితంగా ఉండి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు అన్నారు. బుధవారం గిరిజన భవన్‌లో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి, వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం అధ్యక్షుడు శివానాయక్ , యువజన అధ్యక్షుడు జగన్ నాయక్ ఆధ్వర్యంలో హోలీ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, ఐఏఎస్ అధికారి చిన్నరాముడులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ గిరిజన భవన్‌ను మరింత అభివృద్ధి పరిచేందుకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రూ.10లక్షలు ప్రకటించారని గుర్తు చేశారు. అనంతరం జిల్లాలోని వెయ్యి మంది బంజారాలు తమ ఆటపాటలతో రంగులు చల్లుకొని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్లు రవిశంకర్‌రెడ్డి, డాక్టర్ శివభారత్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట రమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


హోలీ సంబరాల్లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, చిత్రంలో మేయర్ సురేష్ బాబు

సీమకు నికర జలాలు కేటాయించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాయలసీమకు నిధులు.. నికరజలాలు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర ప్రభుత్వాలను కోరారు. కమ్యూనిస్ట్ ఉద్యమ నేత జె. వెంకట్రామిరెడ్డి వర్ధంతి సందర్భంగా బుధవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కమ్యూనిస్ట్ ఉద్యమంలో తొలితరం నాయకుడైన జె. వెంకట్రామిరెడ్డి భూమి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం చేసిన పోరాటాలల్లో కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బషీరున్నీషా, సుబ్రమణ్యం, వేణుగోపాల్, కేసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.


జె. వెంకట్రామిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

మహిళలపై చిన్నచూపు తగదు

కమలాపురం : మహిళలు మగవారితో సమానం అని, మహిళల పట్ల చిన్నచూపు తగదని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎంఓ సాయిరమేష్, చీఫ్ మేనేజర్ భార్గవ్‌రెడ్డి తెలిపారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని నల్లింగాయపల్లె సచివాలయంలో సర్పంచ్ హైమావతి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు భారతి పరిశ్రమ ప్రతినిధులు సాయిరమేష్, భార్గవ్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రియాంకరెడ్డి, మహిళలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే క్రాస్ రోడ్డు, పైడిమాను కాలనీ తదితర కాలనీలకు చెందిన 20 మంది పేద మహిళలకు మన ఊరు సేవా సమితి అధ్యక్షుడు శీలం శ్రీనివాసులు చీరలు పంపిణీ చేశారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న భారతి పరిశ్రమ సీఎంఓ సాయిరమేష్

వైభవంగా జమాలయ్య స్వామి ఉరుసు

దువ్వూరు : మండల పరిధిలోని కృష్ణంపల్లె గ్రామంలో బుధవారం జమాలయ్య స్వామి ఉరుసును వైభవంగా నిర్వహించారు. ఉరుసు సందర్భంగా పెద్ద సంఖ్యలో ప్రజలు స్వామి వారి సమాధిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు, పూల చాదర్‌ను స్వామికి సమర్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి సత్యాహరిశ్చంద్ర నాటకం, చింతామణిలో భవాని పాత్ర నాటకాలను ప్రదర్శించారు. ఉరుసులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.